క్లుప్తంగా

రాజాం ఎంపీడీఓగా ఆనందరావు



ఎంపీడీఓ ఆనందరావుకు స్వాగతం పలుకుతున్న కార్యాలయ ఉద్యోగులు

రాజాం: మండలపరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా జె.ఆనందరావు బుధవారం బాధ్యతలు స్వీకరించా రు. ఈయన కోటబొమ్మాళి డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేసి ఎంపీడీఓగా పదోన్నతి పొంది బదిలీపై ఇక్కడకు వచ్చారు.ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించా రు. ఎంపీడీఓకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పాత బొబ్బిలిలో కోబలి పూజలు



పూజల్లో పాల్గొన్న రైతులు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని పాత బొబ్బిలి గ్రామంలో బుధవారం కోబలి పూజలు నిర్వహించారు. పాత బొబ్బిలి సరేపోలమ్మ ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, ఏఎంసీ డైరక్టర్ మింది రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్ కోట పెదరాములు, ఇతర పెద్దల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పైరుకు రుధిరాక్షితలు చల్లారు. పంటలు బాగా పండాలని సరే పోలమ్మను వేడుకున్నారు. పెద్ద ఎత్తున రైతులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



ఆలయం వద్ద భక్తులతో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణంలోని తారకరామ కాలనీ చెరువు గట్టు వద్ద గల విశ్వకర్మ ఆలయం, మల్లం పేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నా యుడు విశ్వకర్మకు పూజలు చేశారు.కార్యక్రమంలో గురువు ముగడ వెంకటరమణ,రిటైర్డ్ హెచ్ఎం ఏ.శ్రీనివాసరావు, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సీఎంకు ఈ-మెయిల్స్



సీఎంకు పంపిన ఈ-మెయిల్స్‌ను చూపిస్తున్న జేసీ రాజు, తదితరులు

బొబ్బిలి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఈ- మెయిల్స్ పంపుతున్నట్టు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన ఏపీటీఎఫ్ సభ్యులు, కార్యకర్తలతో కలిసి బొబ్బిలిలోని గాంధీ బొమ్మ దగ్గర సీఎంకు తమ సెల్‌ఫోన్‌ల ద్వారా మెయిల్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను అమలు చేయాలని మెయిల్స్ ద్వారా కోరామన్నారు. ఇతర ఉపాధ్యాయులు కూడా ఇదే విధంగా మెయిళ్లు పంపిస్తున్నారని చెప్పారు. ఏపీటీఎఫ్ నాయకులు చిన్నారావు, శర్మ,శ్రీనివాసరావు, రమణ, కోట బలరాం, ఆర్.ఎస్.రాజు పాల్గొన్నారు.

గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జేవీవీ గౌరవాధ్యక్షుడు నీలయ్య

రాజాం సిటీ: గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని జనవిజ్ఞానవేదిక(జేవీవీ) జిల్లా గౌరవాధ్యక్షుడు జరజాన నీలయ్య ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యుదయ కవి, సంఘ సంస్కర్త, సాహితీకారుడైన గురజాడ అప్పారావు జయంతి ఉత్సవాలను ఈనెల 21న రాజాంలో నిర్వహించనున్నా మని చెప్పారు. స్థానిక విద్యానికేతన్ విద్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి అంతా హాజరు కావాలని కోరారు. జేవీవీ రాజాం డివిజన్ కార్యదర్శి గొర్లె రమేష్, డివిజనల్ గౌరవాధ్యక్షుడు శాసపు సత్యనారాయణ, కన్వీనర్ బి.నాగేశ్వరరావు, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, జేవీవీ రాష్ట్ర వ్యవసాయ కమిటీ సభ్యులు పెంకి గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు..

- అధ్వానంగా బొబ్బిలి పట్టణ ప్రధాన రహదారి
- మరమ్మతులు చేయకుండా కాలయాపన
- రెండు వైపులా కాలువలు తవ్వేసి వదిలేసిన వైనం
- ఇబ్బందులుపడుతున్న ప్రజల దృష్టి మళ్లించేందుకు కొత్త ఎత్తుగడ
- పట్టణ ఫ్లైఓవర్‌పై రూ.5లక్షలతో డిజిటల్ రోప్ లైటింగ్ పనులు



బొబ్బిలి కాలేజ్ రోడ్డులో ఈపీడీసీఎల్ కార్యాలయల కూడలి వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

బొబ్బిలి: అంచు డాబే కాని కోక డాబు లేదు అన్న సామెత చందాన ఉంది టీడీపీ కూటమి ప్రభుత్వం తీరు. పట్టణంలోని ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టడమో లేక కొత్తగా రహదారి నిర్మాణమో చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతుంటే ఇదిగో నిధులు అంటూ ఏడాది నుంచి కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మిస్తూ వస్తుందే కానీ తెచ్చిననిధులూ కనిపించడం లేదు, పనులు కానరావడం లేదు. ప్రజలు మాత్రం కాలేజ్ రోడ్డు వైపు వెళ్లాలంటేనే భయపడి చస్తున్నారు. రోడ్డు వేస్తామని చెప్పిన అధికారులు, నాయకులు మాత్రం నిధులు రావాల్సి ఉందని చెబుతున్నారు.బుడా నుంచి రూ.కోటికి పైగా నిధులు కేటాయించామని చెబుతున్నప్పటికీ ఆ నిధులు పురపాలక మంత్రి పేషీ దాటి రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరో పక్క జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన నిధులు కూడా కనిపించడం లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం వెళ్లే బైపాస్ వరకు రోడ్డు మరమ్మతుల కోసం నిధులు వచ్చేస్తున్నాయని చెప్పి ముందుగానే రోడ్డుకు రెండు వైపులా కాలువలను తవ్వేశారు. పనులు అక్కడితో నిలిచిపోవడంతో పట్టణంలోని వ్యాపారులు, కొనుగోలుదారులు వాటిని దాటి దుకాణాలకు వెళ్లలే కపోతున్నారు. కొంత మంది దుకాణదారులు సొంతంగా మెటీరియల్ తెచ్చి కాలువపై ప్లాట్‌ఫారాలు నిర్మించుకుంటుంటే మరికొంత మంది చెక్క బల్లలు వేసుకుంటున్నారు.ఎక్కడా ఏ నిధులు రాకపోగా ఎమ్మెల్యే బేబీ నాయన తన సొంత నిధులతో చేస్తామన్న రహదారి పనులు ఎక్కడికెళ్లాయో తెలియడం లేదు. కాలేజ్‌రోడ్డులో కొన్నిచోట్ల గుంతలు కప్పారేతప్ప కానీ పూర్తిస్థాయి మరమ్మతులు చేయకపోవడంతో నిత్యం మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలేజ్ రోడ్డులో ప్రయాణించే వారి దృష్టి మరల్చేందుకు పాలకులు డిజిటల్ లైటింగ్ ఏర్పాటుకు పూనుకున్నారు.



ఫ్లై ఓవర్‌పై డిజిటల్ లైటింగ్ పనులు

రోప్ లైటింగ్ ఇప్పుడు అవసరమా..?

బొబ్బిలి పట్టణంలో ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతుల కోసం రూ.35 లక్షలతో ఓ ప్రతిపాదన వెళ్లినా అది కార్యరూపం దాల్చలేదు. మరో పక్క రూ.1.10కోట్ల బుడా నిధులు మంజూరు చేసినా దీనికి పురపాలక మంత్రి ఆమోదం లేదు. దీంతో రహదారి ఇబ్బందుల నుంచి ప్రజల ఆలోచన దాటవేయడానికి అన్నట్టు రూ.5లక్షలతో పట్టణ ఫ్లైఓవర్‌పై డిజిటల్ రోప్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు రెండు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. ఫ్లైఓవర్‌పై రంగు రంగుల డిజిటల్ లైట్లు వెలిగించనున్నాం, వచ్చి చూసుకోండి కానీ రోడ్ల గుంతల గూర్చి మాత్రం అడగొద్దని ఇక్కడి పాలకులు చెబుతున్నట్టు ఉంది. ఈ లైటింగ్ పనులను చూసిన ప్రయాణికులు ముందు రోడ్డు బాగు చేయకుండా ఈ సోకులెందుకు అని ప్రశ్నిస్తున్నారు.



కాలేజ్ రోడ్డులో దుకాణాల ముందు కాలువలు తవ్వేసి వదిలేసిన దృశ్యం

పరామర్శ

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొమ్మి కన్నంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం కూనాయవలస వెళ్లి కన్నంనాయు డు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నంనాయుడి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. బొబ్బిలి ఏఎంసీ మాజీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బోడెల విజయబాబు, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ సభ్యుడు రాయులు, బొబ్బిలి వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథశర్మ, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



కన్నంనాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులాహ్వానం

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో మిగులు సీట్లకు నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.వి. శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్నప్పుడు వచ్చే యూనిక్ నెంబర్‌తో ఐటీఐలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 28న కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలని పేర్కొన్నారు. మెరిట్ లిస్టులో పేరున్న వారు ఈనెల 29న పదోతరగతి సర్టిఫికెట్, కులధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, ఆధార్ లింకైన ఫోన్ నెంబర్, టీసీ, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్ల నిరసన



బొబ్బిలి: నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

బొబ్బిలి: ఆటో కార్మికుల నుంచి వివిధ మోటారు వాహన చట్టాల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి ఎందుకు వెనుకాడుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ప్రశ్నించారు. ఆటో కార్మికులు బుధవారం నిర్వహించిన జిల్లా వ్యాప్త బంద్‌లో భాగంగా స్థానిక బస్‌స్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటోలకు బేరాలు లేవని, ఆటో డ్రైవర్లు వీధిన పడ్డారన్నారు. లైసెన్సు ఉన్న ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటోలకు ప్రభుత్వమే ఇన్స్యూరెన్స్ చెల్లించాలని కోరారు. అచ్యుతాపురంలో నెలకొల్పిన వేదాంత ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆటో కార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ సభ్యులు పాల్గొన్నారు.



రామభద్రపురం: రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

రాస్తారోకో..

రామభద్రపురం: ఆటోల బంద్ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు స్థానిక రహదారిపై బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అన్న నినాదాలతో మండల కేంద్రం దద్దరిల్లింది.ఆటో యూనియన్ నాయకులు చొక్కాపు లోకేష్, ఎస్ గంగయ్య, కె.సంజీవ్,కె.వెంకటరమణ,ఆర్.రామకృష్ణ, సోములు, తదితరులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజ్' రేపు

బాడంగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీ కరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19న చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ, విద్యార్థి,యువజనవిభాగాల అధ్యక్షులు తెంటుతిరుపతిరావు, బేతనపల్లి శంకరరావు తెలిపారు.మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 19వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రం విజయనగరంలోని జేఎన్‌టీయూ కూడలి నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గ విద్యార్థులు,యువకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో దోమల నివారణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్

రాజాం: మండలంలో బొడ్డవలస, డి.ఆర్.ఎన్.వలస గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు బుధవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. 'విజృంభిస్తున్న దోమల దండు' శీర్షికత ఈనెల 17న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాజాం మండల డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పలు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, 15వ ఆర్థిక సంఘ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశించారు. అనంతరం డి.ఆర్.ఎన్.వలస, బొడ్డవలస గ్రామాల్లో దోమల నివారణకు చేపట్టిన ఫాగింగ్‌ను పరిశీలించారు. అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ చేయిస్తామని చెప్పారు.



డి.ఆర్.ఎన్.వలస ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు

బొబ్బిలి: ప్రధాన మంత్రి పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మరిశర్ల రామారావు ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణంలో బుధవారం నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వరాలయం,వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజలు, స్వచ్ఛతా సేవా కార్యక్రమా లు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని హాజరయ్యారు. నాయకులు పెంట స్వామి నాయుడు, చెలికాని కేశవ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మఅంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని బూరాడ, తాటిపాడు, లక్ష్మణవలస, తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తనిఖీలు చేశారు. రికార్డులు,పౌష్టికాహారం స్టాక్‌ను, చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. పిల్లలు వయస్సుకు తగ్గట్టుగా బరువు ఉండాలని, బరువు తక్కువ ఉన్న పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

ఫిజియోథెరపీ సేవలు

రేగిడి: ప్రత్యేక అవసరాల చిన్నారులకు రోజు ఫిజియోథెరపీ చేయడం వల్ల వారిలో అంగవైకల్యం కొంతమేర తగ్గుతుం దని ఫిజియోథెరపిస్ట్ రమాచంద్రిక అన్నారు.స్థానిక ఎమ్మార్సీ వద్ద ఉన్న భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలకు చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ చేశారు. ఈసేవలను ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు పరిశీలించారు. ఐఈఆర్‌టీలు యు.మహేశ్వరి, టి.రాజేష్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామస్తులకు రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు, వైద్యసిబ్బంది లెప్రసీ(కుష్టు) వ్యాధిపై బుధవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, నరాల తిమ్మిర్లు, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం, కనుబొమ్మలు మూతపడకపోవడం వంటివి కుష్టు వ్యాధి లక్షణాలని ప్రజలకు వివరించారు. ఈ లక్షణాలు ఉన్న వారు స్థానిక ఆశ వర్కర్‌కు తెలియజేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

తెర్లాం: పాడిరైతులంతా తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, నెమలాం పశువైద్య కేంద్రం డాక్టర్ అరుణ సూచించారు. మండలంలోని రాజయ్యపేట, తదితర గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు పర్యవేక్షించారు.

రీసర్వే సక్రమంగా చేపట్టాలి

బాడంగి: మండలంలో భూముల రీసర్వేను సక్రమంగా చేపట్టాలని, తప్పులు జరగడానికి వీల్లేదని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. మండలంలో రీసర్వే జరుగుతున్న గ్రామాల సచివాలయ సర్వేయర్లతో పాటు మిగతా సర్వేయర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ముఖ్యంగా జాయింట్ ఎల్‌పీఎంలు, విస్తీర్ణంలో హెచ్చు,తగ్గులు లేకుండా, ఎఫ్‌లైన్ పిటీషన్లు రాకుండా చూడాలన్నారు.గ్రౌండ్ ట్రూథింగ్ చేసేటప్పుడు సంబంధిత రైతులను పిలిపించుకుని, కచ్చితమైన హద్దులు నిర్ధారించు కోవాలన్నారు. మండల సర్వేయర్ సతీష్, హెచ్‌డీటీ ధనం, రీసర్వే డీటీ అప్పలనాయుడు, ఎంఆర్ఐ జగదాంబ పాల్గొన్నారు.

సుస్థిర గ్రామాభివృద్ధిపై శిక్షణ



మాట్లాడుతున్న బాడంగి ఎంపీడీఓ రామకృష్ణ

బొబ్బిలిరూరల్: గ్రామాల సుస్థిరాభివృద్ధి కోసం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సమష్టిగా ప్రణాళికలు రూపొందించాలని బాడంగి ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. .గ్రామాల సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గజపతినగరం,దత్తిరేజేరు,రామభద్రపురం మండలాల ఎంపీపీలు,సర్పంచ్‌లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ప్రణాళికల తయారీ, గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన పనులు, తదితర అంశాలపై ఆయా మండలాల ఎంపీడీఓలు, రిసోర్స్ పర్సన్‌లు అవగాహన కల్పించారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



బాడంగి మండల కేంద్రంలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 18మంది విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ఆ పాఠశాల పీఈటీ బి.సన్యాసప్పడు బుధవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీవరకు అండర్-14, 17 విభాగాల్లో జరిగిన జిల్లాస్థాయి జూడో, సైక్లింగ్, మాల్కాంబ్, ఆర్చరీ పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.విద్యార్థులతో పాటు పీఈటీని ప్రిన్సిపాల్ కె.వి.రమణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. - బాడంగి

విపత్తులపై విద్యార్థులకు అవగాహన



ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించేటప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని రాజాం అగ్నిమాపక శాఖ ఎస్ఐ పి.అశోక్ అన్నారు. రాజాం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ అవగాహన, అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని చెప్పారు. వంట గ్యాస్ సిలిండర్ లీకేజ్ వల్ల వచ్చే మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరించారు. ప్రమాదాలు సంభవించే సమయంలో ఆందోళన చెందకూడదని, సమయస్ఫూర్తితో ప్రమాద తీవ్రత తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. - రాజాం సిటీ

ఉపాధ్యాయుల రణభేరి



ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఈనెల 15 నుంచి రణభేరి కార్యక్రమం నిర్వహిస్తోంది. అందులో భాగంగానే బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు బుధవారం బైక్ జాతాను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దుచేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని, పెండింగ్ డీఏలు తక్షణమే చెల్లించాలని, పీఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్ 30శాతం ప్రకటించాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఈనెల 25న విజయవాడలో బహిరంగ సభ నిర్వహించనున్నామని, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నాయకులు ప్రసన్న కుమార్,అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. - బొబ్బిలిరూరల్

అన్నదాత అవస్థలు ప్రభుత్వానికి పట్టడం లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు,జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: ఎరువుల కోసం అన్నదాతలు పడుతున్న అవస్థలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి విమర్శించారు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ చేతకాని తనం వల్ల రైతన్నను యూరియా కష్టాలు వీడడం లేదని అన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం పొలం పనులను మానుకుని, తిండి తిప్పలు లేకుండా రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిచ్చి ఎరువు ను కొనుగోలు చేసుకునే రైతులకు ఇన్ని కష్టాలు పెడతారా అని ప్రశ్నించారు. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని మండిపడ్డారు. వరి పంటకు యూరియా వేసేందుకు అదునుదాటిపోతోందని, సకాలంలో ఎరువు వేయకపోతే దిగుబడులపై ప్రభావం ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడాఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' డబ్బులు మంజూరు చేయండి

- పల్లె నిద్ర కార్యక్రమంలో ఎంపీని కోరిన గిరిజనులు



ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ అప్పలనాయుడు

రామభద్రపురం: తమ పిల్లలకు తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బులు జమకాలేదని, మంజూరు చేయాలని రావివలస గిరిజన పంచాయతీ ప్రజలు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కోరారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలం లోని రావివలస గిరిజన పంచాయతీ పరిధి ఎనుబరువు గ్రామంలో బుధవారం రాత్రి గ్రామ సభ నిర్వహించారు.ముందుగా మండల అధికారులు, పంచాయతీ సిబ్బంది తమ నివేదికలు చదివి వినిపిస్తుండగా..గిరిజనులు సమస్యలను ఏకరువు పెట్టారు. ఎనుబరువు గ్రామానికి చెందిన విద్యార్థులు బేటుకూరి ప్రేమ తేజ,ఇంద్రజ, చిన్నారావు, సిమ్మజన్ని జ్యోతి వేర్వేరు పాఠశాలల్లో చదువుతున్నారని, వారికి తల్లికి వందనం పథకం డబ్బులు మంజూరు కాలేదని వారి తల్లిదండ్రులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే రావివలస పంచాయతీకి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేరని, కొత్తగా నియమించాలని పలువురు కోరారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆర్.చింతలవలస గ్రామ ప్రజలు ఎంపీకి వివరించారు.పంచాయతీలోని 14 గ్రామాల ప్రజలు ఎనుబరువు వచ్చి రేషన్ సరుకులు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రోడ్లు బాగు చేయాలని కోరారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సూచన మేరకు జనాభా పెంచేందుకు ఎక్కువ మంది పిల్లలను కనాలని,పిల్లల సంరక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. నాయకులు మడక తిరుపతినాయుడు,కరణం భాస్కరరావు,వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్ర పాల్గొనారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

రేగిడి: స్త్రీనిధి, ఇతర రుణాలను సద్వినియోగించుకుని డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘాల రికార్డులను పరిశీలించారు. పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరాతీశారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు

రేగిడి: మండలంలోని ఏ.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో డివిజన్ స్థాయి అండర్-14 బాల,బాలికల స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈపోటీలను ఎంఈఓలు ఎం.వి.ప్రసాదరావు, బి.ఎరకయ్య ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, అథ్లెటిక్స్ పోటీల్లో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, పాలకొండ, సీతంపేట, బామిని, వీరఘట్టం మండలాలకు చెందిన 800 మంది బాలికలు పాల్గొన్నారని నియోజకవర్గ గేమ్స్ ఇన్‌చార్జి కె.రామచంద్రుడు తెలిపారు. సర్పంచ్ చుక్క వెంకటినాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ గోగుల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు, తదితరులు